## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లటౌన్: పెద్దూరు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఎండీ సురేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పెద్దూరు, సర్దాపూర్, ముష్టిపల్లి, రగుడులో సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

### పోస్టాఫీస్‌లో ఆధార్ సేవా కేంద్రం

సిరిసిల్లటౌన్: తపాలాశాఖ కార్యాలయంలో ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవచ్చని సిరిసిల్ల డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ పెరుగు దయానంద్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న పలు సంక్షేమ పథకాలకు దరఖాస్తులను తపాలా కార్యాలయం నుంచి చేసుకోవచ్చన్నారు. చిన్నమొత్తాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లను పెంచిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పది డిపార్ట్‌మెంట్స్ పోస్టాఫీస్‌లతో పాటు, 87 బ్రాంచి పోస్టాఫీస్‌లలో ఈ సౌకర్యాలు కల్పించబడ్డాయని తెలిపారు.

### ఆలయ మాజీ చైర్మన్‌కు మాతృవియోగం



పరామర్శిస్తున్న చక్రపాణి, నర్సింగరావు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని శ్రీవిశ్వనాథస్వామి ఆలయం మాజీ చైర్మన్, బీఆర్ఎస్ ముఖ్య నేత రాజూరి వాసుదేవరాయలకు మాతృవియోగం కలిగింది. మంగళవారం ఉదయం రాజూరి వజ్రమణి మృతిచెందగా.. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు ఆమె మృతదేహానికి పూలమాలలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### మల్లన్నసాగర్ నీటిని విడుదల చేయండి



ఉత్తమ్‌కు సన్మానం చేస్తున్న చక్రాధర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): సిరిసిల్ల నియోజకవర్గానికి మల్లన్నసాగర్ నీటిని విడుదల చేయాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు కాంగ్రెస్ నాయకుడు కనమేని చక్రాధర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ సచివాలయంలో మంత్రిని మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. ఎగువ మానేరు ప్రాజెక్టులో ఒకటిన్నర టీఎంసీల నీరు మాత్రమే ఉందని చెప్పామన్నారు. మల్లన్నసాగర్ గోదావరి జలాలను కూడవెల్లి వాగులోకి వదలడం ద్వారా ఎగువ మానేరు ప్రాజెక్టులోకి నీరు వస్తుందని మంత్రికి వివరించామని అన్నారు. గతంలో కూడా ఇలాగే చేశారని గుర్తు చేశామన్నారు. రైతులు పూర్తిస్థాయిలో నీటి విడుదల కోసం చూస్తున్నారని, తైబందీ నిమిత్తం లేకుండా 15వేల ఎకరాలకు నీరందించేలా ఈఎన్‌సీకి ఆదేశాలివ్వాలని కోరామని, దీనికి మంత్రి స్పందించారని అన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సన్మానించామన్నారు.

**యాసంగికి మల్లన్నసాగర్ నీరందించాలి**

ముస్తాబాద్: మండలంలో పదివేల ఎకరాల యాసంగి సాగుకు మల్లన్నసాగర్ నీటిని అందించాలని రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు గోపాల్‌రావు డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎగువ మానేరు ప్రాజెక్టు నీటిని కేవలం డిస్ట్రిబ్యూటరీ–18 వరకు మాత్రమే విడుదల చేశారని, చివరి ఆయకట్టుకు నీరందడం లేదన్నారు. ఇప్పటికే ఐదు వేల ఎకరాల సాగును రైతులు వదులుకున్నారని వాపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎగువ మానేరుకు మల్లన్నసాగర్ నీటిని వదిలి, ప్రాజెక్టును నింపి నీటిని అందించామని గుర్తు చేశారు. రాజక్కపేట మీదుగా చీకోడు, మోహినికుంట, మద్దికుంట, ముస్తాబాద్ చెరువులకు నీటిని విడుదల చేస్తేనే రైతుల యాసంగి సాగు పూర్తవుతుందని, లేదంటే పదివేల ఎకరాలు ఎండిపోయే ప్రమాదముందన్నారు.

### బీజేపీలో చేరిన విద్యార్థి నాయకుడు



రాజేందర్‌కు కండువా కప్పుతున్న బండి

వేములవాడరూరల్: వట్టెంల గ్రామానికి చెందిన విద్యార్థి విభాగం నాయకుడు మంద రాజేందర్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పార్టీ కండువా కప్పారు. బాలరాజుపల్లి గ్రామానికి వచ్చిన ఆయన అక్కడే మంద రాజేందర్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించగా.. ఆయనకు కండువా కప్పారు.

# సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్

బోయినపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పని చేస్తే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ హాజరయ్యారు. విద్యాశాఖ నివేదిక ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ చదివాక.. బోయినపల్లి ప్రైమరీ పాఠశాలకు ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ కోరారు. పదవీకాలం అయిపోతుందని, అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేస్తే బిల్లులు రావడం లేదని వెంకట్రావుపల్లి, బోయినపల్లి సర్పంచులు బూర్గుల నందయ్య, గుంటి లతశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్ డీఈ సత్యనారాయణ మాట్లాడుతూ.. పనులకు సంబంధించిన ఎంబీ రికార్డు చేశామని, బిల్లులు ప్రభుత్వం మంజూరు చేయాలని అన్నారు. వెంకట్రావుపల్లి నాలుగు వరుసల రోడ్డు పనుల్లో మిషన్ భగీరథ, మంచినీటి పథకం పైపులు మునిగిపోతున్నాయని, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ అధికారులు ఎవరికి వారు తప్పించుకుంటున్నారని, కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదముందని సర్పంచ్ బూర్గుల నందయ్య అన్నారు. బోయినపల్లి 7వ వార్డులో ఏడాదిగా మిషన్ భగీరథ పైపులు లీకేజవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ ఆరోపించారు. చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఏఈ అజయ్ అన్నారు. వైద్యశాఖ నివేదికలను విలాసాగర్, బోయినపల్లి, కొదురుపాక పీహెచ్‌సీల డాక్టర్లు సభకు నివేదించారు. కోవిడ్ జాగ్రత్తలు ప్రజలకు తెలియజేయాలని ఎంపీపీ కోరారు. ఈజీఎస్ నిధులతో నిర్మించిన తెలంగాణ క్రీడాప్రాంగణం బిల్లులు రావడం లేదని సర్పంచులు నందయ్య, లతశ్రీ అన్నారు. ఏపీవో సబిత మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాలని తెలిపారు. మండలంలో 7,632 మందికి జాబ్ కార్డులున్నాయని, 3,350 మంది కూలీలు పని చేస్తున్నట్లు చెప్పారు. సెస్ ఏఏఈ ప్రశాంత్ మాట్లాడుతూ.. 14వ ఆర్థిక సంఘం నిధులతో జీపీలు విద్యుత్ బకాయిలు చెల్లించాలని కోరారు. మండలంలో 23 మంది సర్పంచులు, 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా.. ఇందులో కేవలం నాలుగు గ్రామాల సర్పంచులు, ఎంపీపీతో కలుపుకొని ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. సర్పంచులకు ఇది చివరి సమావేశం కాగా.. మెజార్టీ సర్పంచులు హాజరు కాకపోవడం గమనార్హం.

## ఆధ్యాత్మికం

### కేటీఆర్‌కు తిరుమల ప్రసాదం అందజేత



ప్రసాదం అందిస్తున్న దేవేందర్‌యాదవ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని నాయకుడు, సింగిల్‌విండో డైరెక్టర్ బండి దేవేందర్‌యాదవ్ మంగళవారం అందజేశారు. కేటీఆర్ ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకు తిరుమలలో మొక్కు చెల్లించుకున్నారు. నాయకులు ఆత్మకూరు చంటియాదవ్, మోతె మహేశ్‌యాదవ్ తదితరులు న్నారు.

### లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న చిక్కాల

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారిని మంగళవారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు దర్శించుకున్నారు. పూజలు నిర్వహించారు.

### బూట్లతో అక్షింతలు మోసిన ఎంపీటీసీ



అక్షింతలు మోస్తున్న అంతయ్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్ల మాజీ జెడ్పీటీసీ, తంగళ్లపల్లి ప్రస్తుత ఎంపీటీసీ కోడి అంతయ్య తీరు వివాదాస్పదమైంది. మంగళవారం అయోధ్య శ్రీరాములవారి అక్షింతలను ఆయన బూట్లు వేసుకొని మోసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఆయనపై శ్రీరాముడి భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్షింతలను బూట్లు వేసుకొని తాకడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

# బాధిత కుటుంబానికి చేయూత



బియ్యం, నగదు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: మద్దికుంటకు చెందిన ఇల్లందుల లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా.. బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం, నగదును మంగళవారం అందించినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వపరంగా కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తలారి నర్సింలు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోవర్ధన్ నాయక్, కొండయ్య, రాజమల్లయ్య, బాల్‌రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

**టై, బెల్టులు వితరణ**

ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త సింగరవేణి కృష్ణ తన సొంత ఖర్చులతో మంగళవారం టై, బెల్టులు అందజేశారు. కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బియ్యం వితరణ**

తంగళ్లపల్లి: రామన్నపల్లె గ్రామానికి చెందిన రాగుల నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. మాజీ జెడ్పీటీసీ, ఎంపీటీసీ కోడి అంతయ్య 50 కిలోల బియ్యాన్ని వితరణ చేశారు.

# రాముడి అక్షింతలతో శోభాయాత్ర







రాచర్లతిమ్మాపూర్‌లో శోభాయాత్ర, వీర్నపల్లి: అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు, గొల్లపల్లిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లతిమ్మాపూర్, అల్మాస్‌పూర్ గ్రామాల్లో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాములవారి అక్షింతలతో గ్రామస్తులు పురవీధుల గుండా మంగళవారం శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక శ్రీఆంజనేయస్వామి ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఇంటింటా తిరుగుతూ అక్షింతలను పంపిణీ చేశారు. ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచులు పడిగెల రవీందర్, రాధారపు పుష్పల, వేదపండితులు పురుషోత్తమచారి, శ్రీనివాసచారి, మహిళలు పాల్గొన్నారు.

**గ్రామాల్లో..**

వీర్నపల్లి: అడవిపదిర, లాల్‌సింగ్‌తండా గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో పని లక్ష్మణ్, తిప్పవరం భాస్కర్, భూక్య గజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్షింతలు, శ్రీరాముడి ఫొటో, కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. పని శివరామకృష్ణ, అంజయ్య, బాజిరెడ్డి రాజు, మట్టెల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**గొల్లపల్లిలో..**

కోనరావుపేట: రాజన్నగొల్లపల్లి(కొలనూర్)లో అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించి పంపిణీ చేశారు. సర్పంచ్ బొజ్జం వసంత, ఉప సర్పంచ్ కలకుంట్ల లావణ్య, వార్డు సభ్యులు శేఖర్, మల్లేశం, గ్రామస్తులు బాలమల్లయ్య, ముత్యం, రాజు, నరేశ్, రాజు, మహిళలు పాల్గొన్నారు.

# హైఓల్టేజీతో కాలిపోయిన గృహోపకరణాలు



కాలిపోయిన టీవీ



ఎల్లారెడ్డిపేటలోని కిరాణ దుకాణంలో కాలిపోయిన సీసీ కెమెరాల విడి భాగాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నెల రోజుల్లో మూడుసార్లు హెచ్చుతగ్గులతో విద్యుత్ సరఫరా జరిగి ఇళ్లలో రూ.లక్షల్లో విలువ చేసే గృహోపకరణాలు కాలి బూడిదవుతున్నా.. సెస్ అధికారులకు చీమ కుట్టినట్లు లేదు. విలువైన వస్తువులు దగ్ధం కావడంతో పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో నెల రోజుల్లో మూడుసార్లు హై, లోఓల్టేజీ విద్యుత్ సరఫరాతో ఇళ్లలోని విలువైన ఎలక్ట్రానిక్ సామగ్రి, టీవీలు, వ్యాపార సముదాయాల్లోని కంప్యూటర్‌లు, సీసీ కెమెరాలు దగ్ధం అయ్యాయి. తాజాగా మరోసారి మంగళవారం ఉదయం హైఓల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో సుమారు 37 ఇళ్లలో విలువైన సామగ్రి కాలి బూడిదయింది. దీంతో పలువురికి చెందిన రూ.3.75లక్షల విలువైన ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. ఇలా వరుసగా కరెంట్ హెచ్చుతగ్గులతో సరఫరా జరిగి నష్టం జరుగుతున్నా.. సంబంధిత సెస్ అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం ఇలా కరెంట్ సరఫరా ఎందుకు జరుగుతుందనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదు. ఇప్పటికైనా సెస్ ఎండీ వరుస సంఘటనపై దృష్టి సారించి సమస్య పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల కేంద్ర ప్రజలు కోరుతున్నారు.

### పశువైద్య శిబిరానికి స్పందన



కనగర్తిలో శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

కోనరావుపేట: కనగర్తిలో కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరానికి స్పందన లభించింది. పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. రైతులకు పశువుల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రహారం డెయిరీ మేనేజర్ రవీందర్, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లెల్ల లక్ష్మారెడ్డి, సాగర్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, అండెం రాజిరెడ్డి, డైరెక్టర్లు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

### పీఆర్టీయూ నూతన కార్యవర్గం



హరికృష్ణ

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: ప్రోగ్రెసివ్ రికగ్నైజ్‌డ్ టీచర్స్ యూనియన్(పీఆర్టీయూ) జిల్లా నూతన కార్యవర్గ నియామకం మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా మ్యాడారం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీకాంత్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికకు సహకరించిన వారికి హరికృష్ణ, శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

### అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి



సెస్ ఏఈఈకి వినతి పత్రం ఇస్తున్న బాల్‌రాజ్

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం హైవోల్టేజీ కారణంగా ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, సంపు మోటార్లు కాలిపోయాయని, వెంటనే సెస్ అధికారులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ సెస్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. బస్టాండ్ ప్రాంతంలోని ప్రజలకు 160 కేవీఎస్ఎస్ 21 ద్వారా ఇక్కడి ఇళ్లకు విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

## విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



నైపుణ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): విద్యార్థుల్లో జీవన నైపుణ్య కళలను పెంపొందించాలని, దానికి అనుగుణంగా ప్రోత్సహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం మండలంలోని పద్మనగర్ కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలను అడిషనల్ కలెక్టర్ గౌతమి పూజారితో కలిసి సందర్శించారు. విద్యార్థులు ఆధునిక ప్రపంచంతో పోటీపడేలా నైపుణ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో రమేశ్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, డీపీఆర్వో దశరథం, ప్రిన్సిపాల్ శ్యామల ఉన్నారు.

## పశుగ్రాసం దగ్ధం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు అంతర్పుల పెద్ద ఎల్లయ్యకు చెందిన గడ్డివాములు(పశుగ్రాసం) మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం.. తనకున్న పశువుల మేత కోసం అదే గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద పశుగ్రాసాన్ని రూ.10వేలకు కొనుగోలు చేశాడు. బస్టాండ్ ప్రాంతంలో వాములుగా పేర్చి నిల్వ చేశాడు. అయితే గడ్డివాములకు నిప్పంటుకొని పూర్తిగా కాలిపోవడంతో సదరు రైతుకు రూ.10వేల నష్టం వాటిల్లింది. బాధిత రైతును ఆదుకోవాలని స్థానికులు కోరారు.

### జాతీయ యువజన ఉత్సవ పోటీలకు ఎంపిక



హస్తకళలతో భార్గవి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని జాతీయ యువజన ఉత్సవాల పోటీలకు ఎంపికైంది. హస్తకళా విభాగంలో సి.భార్గవి ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.రజనీ తెలిపారు.

## నెలాఖరులోగా సీఎమ్మార్ లక్ష్యం పూర్తి చేయాలి



రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

కోనరావుపేట(వేములవాడ): రైస్ మిల్లర్లు ఈనెల 31లోగా సీఎమ్మార్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. మండలంలోని నిజామాబాద్, కొలనూర్ గ్రామాల్లోని రైస్‌మిల్లులను మంగళవారం తనిఖీ చేశారు. ఆయా మిల్లుల్లో సేకరించిన ధాన్యం, సీఎమ్మార్ లక్ష్యం తదితర పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని మిల్లర్లు 31లోపు ఎఫ్‌సీఐకి బియ్యాన్ని అందించాలన్నారు. ఇందుకోసం 4 మిల్లులకు కలిపి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తున్నామని, వారు తమ విధులతో పాటు అదనపు పని పూర్తిచేయాలన్నారు. అంతకుముందు కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ రకాల సర్టిఫికెట్లు, ధరణిలో పెండింగ్ సమస్యల గురించి ప్రశ్నించారు. సర్టిఫికెట్లు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అలాగే ఓటరు నమోదుకు ఈ నెల 21, 22వ తేదీల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ నవీన్, ఆర్‌ఐ రజిని తదితరులు ఉన్నారు.

### రంగనాయక సాగర్ కాలువ పరిశీలన



పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ, ఎంపీటీసీ రాము

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామానికి రంగనాయక సాగర్ ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా చేసేందుకు మంగళవారం కాలువను అధికారులతో కలిసి ఎంపీటీసీ బైరినేని రాము పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈతో మాట్లాడి దాచారం మీదుగా చిన్నలింగాపూర్, నర్సింహులపల్లి, బాలమల్లుపల్లె గ్రామాలకు నీటిని అందించాలని కోరారు.

## ఆరోగ్య మహిళకు స్పందన



నేరెల్ల పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కార్యక్రమం

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహిస్తున్నటు డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వైద్యారోగ్య శాఖ చేపట్టిన ఆరోగ్య మహిళ శిబిరానికి మంచి స్పందన వస్తోందన్నారు. సిరిసిల్లలోని పీఎస్‌నగర్, వేములవాడ పీపీసీ, నేరెళ్ల పీహెచ్‌సీ, తంగళ్లపల్లి పీహెచ్‌సీల్లో మహిళలకు ఉచితంగా వైద్యరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ హెల్త్ సెంటర్లలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాల్లో ఓపిడి(596), బ్రెస్ట్(596), ఓరల్ కావిటీ(596) పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా యూటీఐ(12), ల్యాబ్(54), థైరాయిడ్(42), విటమిన్ డీ(38), సీబీపీ(39), సూక్ష్మ పోషకాల(54) పరీక్షలు నిర్వహించి వీరిలో ఏడుగురు పేషెంట్లను జిల్లాసుపత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. ఆయా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక తరగతులు



రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు

రుద్రంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని అధ్యాపకులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ప్రిన్సిపాల్ పులి గంగయ్య మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.